క్లుప్తంగా

ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

కంబాలచెరువు: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 76వ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయ సమస్యలైన సీపీఎస్ రద్దు, పెండింగ్‌లోని డీఏలపై ప్రధానంగా చర్చ జరిగిందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటరెడ్డి, ఎం.లక్ష్మణరావు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు అధికారులను, నాయకులను కలిసి ప్రధాన సమస్యలపై మెమోరాండం ఇస్తామన్నారు. దివంగత గుబ్బల సత్యనారాయణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి బైబిలు మిషను మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షారోన్ కుమార్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మార్గాని ఎస్టేట్ ఆవరణలో ఈనెల 14, 15, 16 తేదీల్లో బైబిలు మిషను 56వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు బైబిలు మిషను కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జే షారోన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవదాసు అయ్యగారి శిష్యులు దివంగత ఎస్.సుదర్శనం ద్వారా 1968 నుంచి ప్రారంభమై ప్రతి సంవత్సరం ఈ సభలు జరుగుతున్నాయన్నారు. ఈ సభల్లో ముఖ్యఅతిథిగా ఎంపీ మార్గాని భరత్ రామ్ పాల్గొంటారన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. సుదర్శన్, రత్నంరాజు, మార్టిన్, అగస్టీన్ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడి వద్ద హైవే నిర్మాణ పనుల నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దీని ప్రభావంతో మోరంపూడి, సాయి నగర్, అరవింద్ నగర్, గణేష్ నగర్, గాదాలమ్మ నగర్, మీనాక్షి లేఅవుట్, హనుమాన్ నగర్, వెంకటగిరి -2, హుకుంపేట ఎస్సీపేట, జైహింద్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గౌతమి స్మార్ట్ స్కూల్లో చదరంగం పోటీలు నిర్వహించారు. బాలురు విభాగంలో వి.భవిష్ణ సాయి శివాజీ, కొనపర్తి సాయిసాగర్, బాలికల విభాగంలో అల్లూరి నేహశ్రీ, వి.లక్ష్మీ వెంకట సమన్విత విజేతలుగా నిలిచారు. వీరికి ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కల్యాణ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలు మే7 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.

క్రికెట్ కిట్ పంపిణీ

సీటీఆర్ఐ: మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆదివారం రెల్లి యువకులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

రచయితల సమితి సమావేశం

ప్రకాశం నగర్: శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి ఆకాంక్షించారు. ప్రకాశం నగర్ రెండు పార్కు సమీపంలోని వినాయక గుడి ప్రాంగణంలో ఆదివాం రచయితల సమావేశం నిర్వహించారు. యార్లగడ్డ మోహనరావు, సీహెచ్ కూర్మయ్య, ఎస్సార్ పృథ్వీ, సప్పా దుర్గాప్రసాద్, మల్లెమొగ్గల గోపాలరావు పాల్గొన్నారు.

20న చలో ఢిల్లీ

మధురపూడి: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పల్లా వెంకట నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రైతు, కూలీల సమస్యల సాధన కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామ దేవత పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం కొనసాగాయి. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాలు 14వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

ఘనంగా రాజుల పండగ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆదివారం రాజుల పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. తమ పంటను ఇంటికి చేర్చుకుంటున్న సందర్భంగా దీన్ని జరిపారు. తొలుత జమ్మిచెట్టు కింద కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలు, పూర్వీకులను గుర్తు చేసుకుంటూ పూజలు చేశారు. బూరుగుపూడి పీఏసీఎస్ డైరెక్టర్ అడపా రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.



28వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



కేక్ కట్ చేస్తున్న నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న టీకే విశ్వేశ్వరరెడ్డి



కడియంలో కేక్ కట్ చేస్తున్న గిరజాల బాబు తదితరులు

ప్రతి అడుగు.. పేదలకు తోడు

- పదమూడో వసంతంలోకి వైఎస్సార్ సీపీ
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం
- వేడుకలు నిర్వహించిన ఎంపీ భరత్‌రామ్ తదితరులు



వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



హైటెక్ బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి



బొమ్మూరులో ఆవిర్భావ దినోత్సవం



బుర్రిలంకలో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి తదితరులు



ధవళేశ్వరంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు



హుకుంపేటలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



పొట్టిలంకలో పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో పేదలకు తోడుగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీ ఆదివారం పదమూడో వసంతంలోకి అడుగుపెట్టింది. అప్పట్లో రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు నిరసనగా, వైఎస్సార్ ఆశయాల సాధన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పార్టీని ఏర్పాటు చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పేదల తరఫున ఉవ్వెత్తున పోరాటం చేసింది. అలాగే అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతే ధ్యేయంగా సాగుతోంది.

సంక్షేమమే ప్రధాన అజెండా

రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రధాన అజెండా అని పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి వైఎస్సార్ సీపీ శ్రేణుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులకే కాకుండా యావత్ రాష్ట్ర ప్రజలకు ఈ రోజు పెద్ద పండగ అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. జగనన్న పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని, ప్రతి ఒక్కరిలోనూ సంతోషం, ప్రతి కుటుంబంలో నవ్వులు వెల్లివిరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు రావిపాటి రామచంద్రరావు, పాలిక శ్రీను, మింది నాగేంద్ర, పిల్లి నిర్మల, ఎస్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక 28వ డివిజన్‌లో ఆర్యాపురం అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్ ముందుగా వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేసి కేక్‌ను కట్ చేశారు. రూరల్ నియోజక వర్గ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

రాజమహేంద్రవరం సిటీ: రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ వద్ద ఉన్న ఆటోస్టాండ్‌లో ఆదివారం షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగుర వేసి కేక్ కట్ చేశారు. గుదే రఘు నరేష్, సునీల్ కుమార్, బూడిద శరత్ కుమార్, డాక్టర్ కార్తీక్ సింగంపల్లి పాల్గొన్నారు.

జనరంజక పాలన

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. నగరంలో కోటగుమ్మం సెంటర్, 38వ డివిజన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

2024లో వైఎస్సార్ సీపీదే విజయం

ప్రజా సంక్షేమపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మరోసారి విజయఢంకా మోగించనున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పేపర్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణసాయి కల్యాణ మండపం వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు, పేపరుమిల్లు కార్మిక నాయకుడు ప్రవీణ్ చౌదరి పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పాలన

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. హుకుంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి, అనంతరం కేక్ కట్ చేశారు. పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు(అను), ముత్యాల పోసికుమార్, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, మండల జేఏసీ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, రూరల్ నియోజకవర్గ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బొమ్మూరులో...

బొమ్మూరులోని వైఎస్సార్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, గ్రామకమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీను, సద్గుణ రామారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, మత్సేటి శివ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. శాటిలైట్ సిటీలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో దేవీచౌక్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న పోలిశెట్టి నారాయణ, చిలుకూరి రామకృష్ణ, నందం విజయ్, ఐసెటి ఏసును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, ఆలయ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డా బుజ్జి, స్థానిక నాయకులు పసల నాయుడు, శ్రీనివాస్, గుత్తుల వాసు, మర్రి చంద్రరావు, ఖండవల్లి జాను, కొత్తూరి బాలనాగేశ్వరరావు పాల్గొన్నారు.

- బుర్రిలంకలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కడియం మండల జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, నర్సరీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి నాగశివాజీ, పార్టీ నాయకులు ఈలి సత్తిబాబు, అన్నందేవుల శ్రీనివాస్, ఊటుకూరి శైలజ, గోవింద్ ముత్యం జగదీష్, తాడాల రఘురాము, ఆకుల బాబ్జి, మండెల దొరబాబు, తూపాటి వరాలు, తానంకి ఏసు తదితరులు పాల్గొన్నారు.
- కడియపులంకలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుని స్వీట్లు పంపిణీ చేశారు. బోడపాటి సత్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీనివాస్, జంగా కేదార్‌నాథ్, జనపరెడ్డి శ్రీనివాసు, బొరుసు వీర్రాజు పాల్గొన్నారు.
- జేగురుపాడులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎంపీటీసీ ఆకుల సుధాకర్, నాగిరెడ్డి వీరశివాజీ, పుట్టా బుజ్జి, పేపకాయల సత్యనారాయణ, నిచ్చెనకోళ్ల గోవిందు, బళ్ల అన్నవరం, కేసనపల్లి సత్యనారాయణ, వరసాల నాని పాల్గొన్నారు.
- దామిరెడ్డిపల్లిలో ధర్మాసనం వీరభద్రరావు, తాతపూడి రాంబాబు, బుడ్డిగ వీరవెంకట్రావుగౌడ్, అన్నందేవుల శంకరం, రంపం గోపాలకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- పొట్టిలంకలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, పార్టీ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి సత్య, దాసరి స్వామి, తోరాటి మల్లేశ్వరరావు, కర్రా ముక్తేశ్వరరావు, పల్లి కిరణ్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని దుళ్ల, కడియపుసావరం, పొట్టిలంక, మాధవరాయుడుపాలెం, వీరవరం గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

అన్ని వర్గాల సంక్షేమం

ధవళేశ్వరం: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి విప్పర్తి వేణుగోణుగోపాలరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వక్ఫ్ డైరెక్టర్ షబ్బర్ బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, తలారి వరప్రసాద్, సాధనాల చంద్రశేఖర్(శివ), శ్రీరంగం బాలరాజు, రేగుళ్ల రాజు, గునిపె అశోక్, పుట్టా పరేష్‌నాథ్, పేర్ల బాసి, పందెళ్ల భానుప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి పక్కా కార్యాచరణ

- నగరంలో పలు షాపులపై దాడులు
- సుమారు నాలుగు టన్నుల సీజ్
- రూ.40 వేల అపరాధ రుసుం వసూలు



ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధాన్ని అమలు జరిపేందుకు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధమయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో నగరంలో పలు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా 75 మైక్రాన్లకు దిగువనున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తదితర వాటిని నియంత్రించే పనిలో శానిటరీ విభాగం అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. చారిత్రక నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా వాడుతుండటంతో పాటు వినియోగించిన వాటిని ఇష్టానుసారంగా కాలువల్లోకి విసిరివేస్తుండంతో పూడిక తీసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం 160 టన్నుల వ్యర్థాలు

సుమారు ఐదు లక్షల మంది జనాభా ఉన్న నగరంలో నిత్యం ప్రజలు వినియోగించే వ్యర్థాలను సుమారు 160 టన్నులు సేకరిస్తున్నారు. వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు సుమారు 20 టన్నుల మేర ఉంటున్నాయి. ఇలా నెలకు 600 టన్నులు పేరుకుపోతున్నాయి. వీటిలో సగం కాలువలు నిండిన తరువాత సేకరిస్తున్నవే కావడం విశేషం. నగర ప్రజలు వ్యక్తిగత శ్రద్ధ కనబర్చకపోవడం వల్లనే ఈ దుస్థితి నెలకొందని పర్యావరణ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ రూల్స్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలను అనుసరించి నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు, సంచులు, గ్లాసులు నియంత్రించేందుకు ఉపక్రమించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్థానే ప్రత్యామ్నాయ వస్తువులు, గుడ్డ సంచులు, జౌళి సంచులు వాడేలా అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధించేందుకు నగరంలో ఇప్పటికే ఉత్తర్వులు ప్రకటించినా, అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో అధికారులు నగరంలోని హోల్‌సేల షాపులపై దాడులు ప్రారంభించారు. సింగిల్ యూజ్ కవర్లు, గ్లాసులు తదితర 4 టన్నులను సీజ్ చేసి సుమారు రూ.40 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు.

నిబంధనలు పాటించాలి



75 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, సంచులు, వాటర్ గ్లాసుల వినియోగంపై నిషేధం ఉంది. వ్యాపారులతో పాటు వినియోగదారులపై సైతం అపరాధ రుసుం వసూలు చేసేలా నిబంధనలు ఉన్నాయి. వీటిని నగరంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు అమ్మే షాపు యజమానులకు వివరించాం. మొదటిసారి హెచ్చరిక, జరిమానా, రెండోసారి అతిక్రమిస్తే లైసెన్సు రద్దుతో పాటు షాప్ సీజ్ చేస్తాం. డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఐ.శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్, రాజమహేంద్రవరం కార్పొరేషన్



అధికారులు స్వాధీనం చేసుకున్న సింగిల్ యూజ్ గ్లాసులు, కవర్లు

ఆధునిక వైద్య విధానాలపై అవగాహన



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు మెమెంటో అందజేస్తున్న వైద్యులు

కంబాలచెరువు: ఆధునిక శస్త్ర చికిత్స విధానాలపై బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్లు అవగాహన పెంచుకోవాలని ట్రీట్‌మెంట్ రేంజ్ హాస్పటల్ ఫౌండర్, భారతదేశ తొలి స్టెప్లర్ సర్కమ్ సిషిస్ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కారెడ్డి అన్నారు. స్థానిక శ్రీకన్య గ్రాండ్ సమావేశ హాలులో ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి కారెడ్డి, సెక్సాలజీ నిపుణులు డాక్టర్ సునీల్ రెడ్డి, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయకుమార్ రెడ్డి పాలవాయి తదితరులు అత్యాధునిక శస్త్ర చికిత్సలు, వైద్యవిధానాలపై బీఎంపీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బీఎంపీలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ, సీతానగరం అధ్యక్షుడు దాసరి నాగమల్రాజు, రాష్ట్ర నాయకులు కొమ్మ శ్రీనివాస్, ఆకాశం గౌరీష్‌బాబు, సుందరపల్లి సుధాకర్, పెదపాటి శివ పాల్గొన్నారు.

లారీ కేబిన్ మీద పడి మెకానిక్ మృతి

రాజమహేంద్రవరం రూరల్: సెప్టిక్ ట్యాంకు లారీకి రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు కేబిన్ మీదపడి మెకానిక్ మృతి చెందాడు. గాదాలమ్మ నగర్ నిమ్మకాయల మార్కెట్ సమీపంలోని అప్సర లాడ్జి వెనుక ఉన్న ఖాళీస్థలంలో ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం సైక్లోన్ కాలనీకి చెందిన మురుకుర్తి వెంకట రమణ (35) గాదాలమ్మ నగర్ అప్సర లాడ్జి వెనుక ఖాళీస్థలంలో లారీలు రిపేరు చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం సెప్టిక్ ట్యాంకు లారీకి రిపేరు చేయాలని ఫోన్ వస్తే అక్కడకు వచ్చాడు. ఆ లారీ కేబిన్ పైకి లేపి మరమ్మతులు చేస్తుండగా, ప్రమాదవశాత్తూ లారీ కేబిన్ అతని తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.